


# పెళ్ళిపిలుపు!

పదిరోజుల్లో రాధ పెళ్ళి, తాంబూలాలు పుచ్చేసుకున్నారు. ముహూర్తాలు పెట్టేసుకున్నారు. శుభలేఖ లచ్చే సేసుకున్నారు.

ఇల్లంతా హడావిడిగా వుంది. అప్పడాలు, ఒడియాలు ఒకళ్ళు, శామియానాలు, వంటసామాగ్రి, వగైరా ఇంకోళ్ళు, బట్టలు, నగలు మరొకళ్ళు, ఉప్పులూ, పప్పులూ, బియ్యం, కూరల డిపార్టుమెంటు వేరొకళ్ళు.

పిలుపుల పని శంకరంకి, శారదకి అప్పగించాడు.

మాధవి పెళ్ళికి ప్రసాద్‌కి, ప్రసన్నకీ అప్పగిస్తే, వాళ్ళు అందరినీ పిలిచి, చివరికి ప్రకాశం మామయ్యని పిలవడం మరచిపోయారు. ఆయన నానా అల్లరి చేశాడు తర్వాత.

సాగర్ పెళ్ళికి, సర్వేశ్వరరావుగారిని చివరి క్షణంలో హడావిడిగా వెళ్ళి పిలిచారని ఆయన ముభావంగా వచ్చి కూర్చుని నాలుగక్షింతలు వేసి లేచి వెళ్ళిపోయాడు.

ప్రసాద్ పెళ్ళికి దారిలో కనబడి శుభలేఖ యిచ్చారని యిప్పటికీ చెప్తూతూ వుంటాడు దేవేంద్రరావుగారు.

హడావిడిలో బాగా దగ్గరి వాళ్ళని, అయినవాళ్ళనే మర్చిపోతూ వుంటాం ఒక్కొక్కసారి.

నిదానంగా కూర్చుని, ఓ పెద్ద లిస్టు తయారుచేశాడు శంకర్. శారద ఓ.కే చేసింది. అందరూ అప్రూవ్ చేశారు. ఎవ్వరినీ మిస్సవడానికి వీల్లేదు. రాధ పెళ్ళి అయిపోయిందంటే ఇహ ఇప్పట్లో పెద్ద కార్యమేమీ లేదు.

అయిన వాళ్ళనీ, కాని వాళ్ళనీ, తెలిసినవాళ్ళనీ, తెలియని వాళ్ళనీ, కనబడిన వాళ్ళనీ, కనబడని వాళ్ళనీ, దగ్గరి వాళ్ళనీ, దూరపు వాళ్ళనీ, మధ్యలో పరిచయం అయిన వాళ్ళనీ, ఎప్పుడో పరిచయం అయిన వాళ్ళనీ, పెద్దవాళ్ళనీ, చిన్నవాళ్ళనీ, మిత్రుల్నీ, శత్రువుల్నీ, ఒకళ్ళని కూడా వదలిపెట్టకుండా అందరినీ పిలిచేశారు.

సకుటుంబ బంధుమిత్ర సపరివార సమేతంగా రావాల్సిందని ఇంగ్లండులో, అమెరికాలో, ఆస్ట్రేలియాలో వున్న బంధువులకి, స్నేహితులకి కూడా వ్రాసేశారు. అచ్చేయించిన పదిహేను వందల శుభలేఖలు ఒక్కటి కూడా మిగల్లేదు.

తెల్లవారితే పెళ్ళి! కళ్యాణ మండపం కళకళలాడిపోతోంది. పెళ్ళి వారిది పక్క ఊరే! ప్రొద్దున్నే వస్తారు.

రాత్రికే అంతా కళ్యాణమండపం చేరుకున్నారు. బంధువులొక్కక్కళ్ళే వస్తున్నారు. వేణ్ణీళ్ళు, కాఫీలు, ఫలహారాలు, పక్కబట్టలు ఏర్పాట్లదిరి పోతున్నాయి.

పట్టుచీరలు నిలిచన చోట నిలవకుండా ఫెళఫెళలాడుతూ కబుర్లాడేస్తున్నాయి లుంగీలు కూర్చున్నచోట లేవకుండా చతుర్ముఖపారాయణం దంచేస్తున్నాయి.

పిల్లలు పెళ్ళి హాలు ఎగిరిపోయేట్టు అరుస్తూ అటూ యిటూ పరిగెట్టేస్తున్నారు. నిద్ర పట్టని ముసలోళ్ళు వాళ్ళమీద అరుస్తున్నారు.

వంట వ్యవహారాలు చూస్తున్న వరాలరావు, పెళ్ళికూతురు మేనమామ “బావా! ఊళ్ళోనే ఏడెనిమిదొందలు శుభలేఖలిచ్చాం. వంటలు వెయ్యిమందికి చాలంటావా?” సందేహంగా అడిగాడు పెళ్ళికూతురు తండ్రిని.

“అందరూ వచ్చేడుస్తారేమిటోయ్! అంతగా అయితే ఎంతసేపు! అప్పుడు చూద్దాంలే” దమ్ము లాగుతూ అన్నాడు దైవాధీనంగారు.

“అవునూ! పెళ్ళివారిని వెంటబెట్టుకు రావడానికి ఎవరెళ్ళారు?” అన్నాడు హనుమాన్‌రావు.

“మీ తమ్ముడు కాంతారావే వెళ్ళాడు. అడుగో మాటలోనే వచ్చాడు. ఏరా! పెళ్ళి వారొస్తున్నారా? అడిగాడు దైవాధీనం గారు.




కారు దిగుతున్న కాంతారావు కంఠం ఖంగుమంది. ఏడిసిట్టుంది శంకర్‌గాడి నిర్వాకం. అందరికి శుభలేఖలు పంపానన్నాడా! పెళ్ళివారికి పంపలేదట. లాంఛనప్రాయంగా ముందు వాళ్ళకి పంపద్దూ! చిరాకు పడుతున్నాడు చిరంజీవిరావుగారు. ఓ శుభలేఖ పుచ్చుకుని బయల్దేరు ముందర! ఏడి శంకర్‌గాడు? ఒరేయ్, శంకరాయ్! ఓ శుభలేఖ యిలా అందుకో ముందు" స్టయిల్‌గా అలంకరించిన ప్లాస్టిక్ పూలు సిగ్గుపడ్డాయి.